క్లుప్తంగా

కరాటేతో ఆత్మరక్షణ



బెల్టులు, సర్టిఫికెట్స్‌తో కరాటే విద్యార్థులు

కోరుట్లటౌన్: కరాటేతో ఆత్మరక్షణ, ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని కల్లూర్‌రోడ్ జీజీఆర్ ఫంక్షన్ హాలులో ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరాటే విద్య ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. ఆర్డీవో వినోద్‌కుమార్, కరాటే మాస్టర్స్ తెలంగాణ చీఫ్ వసంత్, వ్యవస్థాపకులు కోచ్ అల్లె రమేశ్, ఎల్ఎఫ్ఎస్ కరస్పాండెంట్ బండి మహదేవ్, జీఎంఎస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, కౌన్సిలర్ సత్యం, నాయకులు సనావుద్దీన్, సురేందర్, అర్బాజ్, ఆనంద్, కోచ్‌లు సురేశ్, నరేశ్, అనిల్ పాల్గొన్నారు.

తక్కళ్లపల్లి జీపీకి రూ.20లక్షలు మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలోని నూతన గ్రామ పంచాయతీ నిర్మాణం కోసం రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం తక్కళ్లపల్లి సర్పంచ్ గొడుగు కుమారస్వామికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుమారస్వామి, ఉప సర్పంచ్ మంద మహేశ్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, సర్పంచ్ సుంకె లచ్చయ్య, ఉపసర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు విరాళం

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు కోసం సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ రూ.28వేల విరాళం ఆదివారం రజక సంఘం నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చేపూరి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కోరుట్లటౌన్: పట్టణంలోని సహృదయ్ హైస్కూల్ 2003–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక కేదార్ గార్డెన్స్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. టీచర్లు శ్రీపతి రమేశ్, కిషోర్, కొమురయ్య, అరుణ, రాజ్యలక్ష్మి, విద్యార్థులు అజారుద్దీన్, రాజేశ్, రజాక్, సురేశ్, సతీశ్, రాజు, మౌనిక, అనూష, శ్రీవిద్య పాల్గొన్నారు.

కాకా కుటుంబం పేదలకు అండగా ఉంటుంది



మాట్లాడుతున్న బషీర్

వెల్గటూర్: ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి అనేక మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపి, దశాబ్దాలుగా ఎంతో మందికి రాజకీయంగా జన్మనిచ్చిన కాకా కుటుంబం అంటే పెద్దపల్లి నియోజకవర్గంలో ఎంతో అభిమానిస్తారని, అలాంటి వివేక్ వెంకటస్వామిని విమర్శించడం సరికాదని ఎండపల్లి ఎంపీటీసీ ఎం.డీ.బషీర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మపురిలో నిర్వహించిన నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశంలో తనను వేదిక మీదకు పిలవలేదని వివేక్ వెంకటస్వామిపై కన్నం అంజయ్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సమంజసం కాదన్నారు. నాయకులు జాడి రాజేశం, దేవి రవీందర్, తొడేటి బాల్‌లింగు, అశోక్, మల్లేశం, అంజాద్, ఎండీ ఆజీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

11న జాతీయ సదస్సుకు తరలిరండి

కథలాపూర్: ఈనెల 11న బెంగుళూర్‌లో మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సదస్సుకు కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి రాజు కోరారు. ఈ మేరకు ఆదివారం కథలాపూర్‌లో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పేరుకే తహసీల్దార్ కార్యాలయం

- సిబ్బంది లేరు, సౌకర్యాలు కరువు
- నెట్ లేదు, యూపీఎస్ లేదు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- రెండునెలలు అవుతున్నా.. పట్టించుకోని వైనం



భీమారంలోని తహసీల్దార్ కార్యాలయం

మేడిపెల్లి: ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేసేందుకు కొత్త మండలాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు మాత్రం పూర్తిస్థాయిలో కల్పించడం లేదు. జిల్లాలోని కొత్త మండలం భీమారంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశారు. కానీ సిబ్బందిని కేటాయించపోకవడం, సౌకర్యాలు కల్పించకపోవడంతో మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలు అవుతున్నా..

మేడిపెల్లి మండలం నుంచి 9 రెవెన్యూ గ్రామాలు, 4 గ్రామ పంచాయతీలను వేరు చేసి 13 గ్రామ పంచాయతీలతో భీమారం కొత్త మండలంగా ఏర్పాటైంది. మండలంలో మొత్తం 21,362 మంది జనాభా ఉన్నారు. వీరి సౌకర్యార్థం 2022 నవంబర్ 21న మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా భీమారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించారు. కార్యాలయం ఏర్పాటు చేసిన అధికారులు రెండు నెలలు కావస్తున్నప్పటికీ సిబ్బంది, సౌకర్యాలు కల్పించకపోవడంతో రెవెన్యూ సేవల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బంది, సౌకర్యాలు లేవు..

తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్, టైపిస్ట్, ఏఎస్‌వో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు గిర్దావర్‌లు, డిప్యూటీ సర్వేయర్, ఇద్దరు అటెండర్‌లు, వాచ్‌మెన్ ఉండాలి. కానీ ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌తో పాటు ఒక గిర్దావర్, సీనియర్ అసిస్టెంట్‌ను మాత్రమే కేటాయించారు. అలాగే ప్రస్తుతం అన్ని చోట్ల రెవెన్యూ సేవలను చాలా వరకు ఆన్‌లైన్ ద్వారానే అందిస్తున్నారు. కానీ ఇప్పటికీ తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్‌లు ఇతర సామగ్రి రాలేదు. మరోవైపు ధరణి సేవలు ప్రారంభించినప్పటికీ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ప్రింటర్, స్కానర్, స్టేషనరీ ఐటమ్స్ రాకపోవడంతో తిరిగి పాత మండల కేంద్రం మేడిపెల్లికి రావాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

నెట్ లేదు.. యూపీఎస్ లేదు

ధరణితోపాటు అన్ని రెవెన్యూ సేవలు ఆన్‌లైన్ లోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ధరణి కోసం ఏర్పాటు చేసిన ఒక్క కంప్యూటర్ ద్వారానే అన్ని పనులు చేస్తున్నారు. అయితే ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో తహసీల్దార్‌తో పాటు ఇతర సిబ్బంది ఫోన్ డేటా ద్వారా పనులు పూర్తి చేస్తున్నారు. మరోవైపు కార్యాలయంలో యూపీఎస్ సౌకర్యం లేకపోవడంతో కరెంట్ సరఫరా ఆగిపోతే ఉన్న ఆ ముగ్గురు అధికారులకు సైతం పనిలేకుండా పోతోంది. కార్యాలయం ఏర్పాటు చేసిన అధికారులు, త్వరగా అన్నిరకాల సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



సిబ్బంది, సౌకర్యాల లేమిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మండల ప్రజలకు అన్నిరకాల సేవలు తొందరలోనే ఇక్కడి నుంచే అందేలా చూస్తాం.

– ఎండీ.యూసుఫ్, తహసీల్దార్, భీమారం

పూర్తిసేవలు అందించాలి



కొత్త మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. కానీ సిబ్బంది కొరత, సరైన సౌకర్యాలు లేకపోవడంతో తిరిగి మేడిపెల్లికి పోవాల్సి వస్తోంది. భీమారంలోనే పూర్తిస్థాయిలో సేవలు అందేలా చూడాలి.

– లచ్చునాయక్, సర్పంచ్, పసునూర్

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



బహుమతి ప్రదానం చేస్తున్న చైర్‌పర్సన్ శ్రావణి

జగిత్యాలటౌన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణ మేరుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముగ్గులను పరిశీలించి విజేతలైన గట్ల ఝాన్సీరాణి, రామగిరి హారిక, రాపర్తి రాధికకు మున్సిపల్ చైర్‌పర్సన్ బహుమతి ప్రదానం చేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ మేరు సంఘం ఆధ్వర్యంలో మహిళలను ఉత్తేజపరిచే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళల కోసం ప్రభుత్వం స్త్రీనిధి రుణాలు అందిస్తోందని, ఆసక్తి కలిగిన మహిళలు యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 38వ వార్డు కౌన్సిలర్ దాసరి లావణ్య, మేరు సంఘం పట్టణ అధ్యక్షుడు మాడిశెట్టి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు గట్ల రమేశ్, మేరు సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేయడం సరికాదు

అభివృద్ధి, సంక్షేమమే ఏకైక ఎజెండాగా పనిచేస్తున్న తమపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, పట్టణాభివృద్ధే లక్ష్యంగా అమలు చేయనున్న కొత్త మాస్టర్ ప్లాన్‌పై ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు చేయాలని బల్దియా చైర్‌పర్సన్ భోగ శ్రావణి కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని బల్దియా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పట్టణాభివృద్ధే లక్ష్యంగా సాగుతున్న సందర్భంలో మాస్టర్ ప్లాన్‌పై ప్రతిపక్షాలు పసలేని విమర్శలు చేస్తూ తమ పాలకవర్గంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీల తీర్మానం మేరకే మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతున్నామని తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, కౌన్సిలర్లు వొద్ది శ్రీలత, పద్మ, నారాయణరెడ్డి, కప్పల శ్రీకాంత్, క్యాదాసు నవీన్, బొడ్ల జగదీష్, పార్టీపట్టణ ఉపాధ్యక్షులు వొల్లం మల్లేశం, తిరుమలయ్య, కొలగాని సత్యం పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు



రోగులను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డా.సంజయ్

జగిత్యాలటౌన్: ఆపి రోటరీక్లబ్, పావని కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల నియోజవర్గ, పరిసర ప్రాంతాలకు చెందిన 23 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ ఉచిత నేత్ర చికిత్సలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. డా.విజయ్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి జాతర



బోనాలతో భక్తుల ఊరేగింపు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు విద్యాసాగర్‌రావు, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, బద్దం మహేందర్ పాల్గొన్నారు.

చకచకా డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం



పోతారంలో పూర్తయిన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం

సారంగాపూర్: సుదీర్ఘ కాలంగా పనులు సాగిన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులకు ఎట్టకేలకు తుదిరూపం వచ్చింది. మండలంలోని పోతారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. 2017–18లో పోతారం శివారు గ్రామం గణేశ్‌పల్లిలో రెవెన్యూ భూమి 5ఎకరాలు సేకరించి అందులో 20 డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతీ ఇంటి నిర్మాణానికి రూ.5.20లక్షలు మంజూరు చేసింది. నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులు సుదీర్ఘకాలం పాటు సాగాయి. మరో నెలరోజుల్లో నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం ఇంటిలోపల ఫ్లోరింగ్, మరుగుదొడ్ల నిర్మాణం, నల్లాలు, విద్యుత్ ఫిట్టింగ్, తలుపుల బిగింపు పనులు చేపట్టాల్సి ఉంది. కాగా నిర్మాణ పనులు ప్రారంభించడానికి ముందే పోతారానికి చెందిన 20మందిని అధికారులు డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



నివాళి అర్పిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

మల్లాపూర్: క్షణికావేశంలో యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై నవీన్‌కుమార్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద శనివారం రాత్రి రూ.3వేల కోసం ఆత్మహత్య చేసుకున్న అప్పాల వికాస్ చిత్రపటానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులతో కలిసి ఆయన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వీడీసీ సభ్యులు, నాయకులు, వికాస్ కుటుంబసభ్యులు, స్నేహితులు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో పోటీలు

జగిత్యాల: కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఓపెన్ టు నిజామాబాద్ పార్లమెంట్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కేసీఆర్ సేవాదళ్ నిర్వాహకులు తెలిపారు. నిజామాబాద్‌లోని డీఎస్సీ మినీస్టేడియంలో ఈనెల 10, 11, 12వ తేదీల్లో పోటీల నిర్వహణ ఉంటుందని, గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ రూ.30వేలు, మూడో బహుమతి రూ.10వేలు ఉంటుందని తెలిపారు. 98667 70889 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

✦ నేడు దుబ్బరాజన్నలో వేలం

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా సోమవారం వివిధ సేవలు, వస్తువుల అమ్మకాల కోసం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు.

✦ నేడు దుకాణాల నిర్వహణకు వేలం

రాయికల్: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన ఆరు దుకాణాలకు మూడేళ్లపాటు అద్దెకిచ్చేందుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎనుగందుల సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి విక్రమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు రూ.50వేలు బ్యాంక్ డీడీ, నగదుతో వేలంలో పాల్గొనాలని సూచించారు.

✦ ఉచితంగా షుగర్ నిర్ధారణ పరీక్షలు

రాయికల్: మండలంలోని రామాజీపేటలో క్లినోకేర్ లాబొరేటరీ ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్ నిర్ధారణ పరీక్షలతో పాటు రక్తనమూనా పరీక్షలు నిర్వహించారు. ఉపసర్పంచ్ హరీష్‌రావు, మాజీ ఎంపీటీసీ బెజ్జంకి మోహన్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు ఆనంద్, వార్డు మెంబర్ గుర్రం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

✦ వైద్యశిబిరానికి స్పందన

ధర్మపురి: పట్టణంలో ఆదివారం స్థానిక బ్రాహ్మణ సంఘంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యూరాలజీ స్పెషలిస్టు డా.పానుగంటి వివేక్, ఈఎన్‌టీ స్పెషలిస్టు పానుగంటి అచ్యుత్ పలువురుకి వైద్యపరీక్షలు నిర్వహించారు.

ప్రయాణికుల అభిమానం సంపాదించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్ఎంవో చందర్‌రావు

కోరుట్లటౌన్: ఆర్టీసీ లాభాల బాటలో ప్రయాణించడం సంతోషమని, ప్రయాణికుల అభిమానం సంపాదించేందుకు కృషి చేయాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంవో చందర్‌రావు సూచించారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కోరుట్ల మెట్‌పల్లి డిపోల సూపర్‌వైజర్, ప్యాసింజర్ గైడ్‌లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడుతూ ప్రాఫిట్ ఛాలెంజ్ విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. సమావేశంలో కోరుట్ల, జగిత్యాల డిపో మేనేజర్లు లక్ష్మీప్రసూన, నర్సప్ప, మెట్‌పల్లి డిపో సీఐ రాజయ్య, రమేశ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గొల్లవాడ ప్రాథమిక పాఠశాల పూర్తిగా రోడ్డును ఆనుకుని ఉంది. పాఠశాలలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాల లక్ష్మీదేవిపల్లి-అర్పపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని ఉంది. ఈ రహదారి ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటుంది. పాఠశాలకు తాత్కాలికంగా ఫెన్సింగ్ వైరుతో కంచెను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలకు మన ఊరు-మన బడిలో అభివృద్ధి పనుల కోసం స్థానం దక్కలేదు. ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లితండ్రులు చాలా ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల రక్షణ కోసం తక్షణమే ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: వాసం భీమయ్య, మండల విద్యాధికారి
ఫోన్ నంబర్: 94404 48504

ఖాదీ భూముల అమ్మకాలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న సుఖేందర్

మెట్‌పల్లి: ఖాదీ ప్రతిష్టాన్‌కు చెందిన భూముల విక్రయాలపై సీబీ సీఐడీతో విచారణ జరపాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కిషన్‌నగర్, పూడూరుల్లోని భూముల విక్రయంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని, సంస్థకు చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దీనిపై ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో మున్సిపల్ నుంచి ఎటువంటి అనుమతి పొందకుండా దాదాపు 200 గదులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని, వీటిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, పార్లమెంట్ కోకన్వీనర్ గుంటుక సదాశివ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, జిల్లా ఉపాధ్యక్షుడు సుంకేట విజయ్ తదితరులు ఉన్నారు.

నియామకం

✦ మహేంద్ర మేదరి సంఘం కార్యవర్గం

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో సమావేశమైన మహేంద్ర మేదరి సంఘం సభ్యులు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లాలోని వివిధ మండలాల నుంచి హాజరైన మహేంద్ర సంఘం బాధ్యులు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా గైని లచ్చన్న, ముఖ్య సలహాదారుగా వేముల గంగరాజం, ఉపాధ్యక్షులుగా పిల్లి కిషన్, చంద శ్రీహరి, పిల్లి శంకర్, కనికరపు గంగారాం, కార్యదర్శిగా గంగాధర్, సహాయ కార్యదర్శిగా మామిడిపెల్లి వేణు, నర్సింగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఇందూరి గంగాధర్ తెలిపారు.

✦ పద్మశాలి యువజన సంఘం..

మల్లాపూర్: పద్మశాలి యువజన సంఘం మండల అధ్యక్షుడిగా పోతు గోపి, ప్రధాన కార్యదర్శిగా సిరిపురం రాజేశ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు.

✦ అంబేడ్కర్ సంఘం..

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం కొత్తవాడ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్క భూమయ్య, ఉపాధ్యక్షుడిగా అక్కినపెల్లి రమేశ్, కార్యదర్శిగా నక్క సురేశ్, సహాయ కార్యదర్శిగా మహంకాళి అజయ్, కోశాధికారిగా నక్క రాజేశ్‌ను ఎన్నుకున్నారు.

✦ గణేశ్‌నగర్ సంక్షేమ మండలి అధ్యక్షుడిగా మధుసూధన్‌రెడ్డి

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్ రెసిడెంట్స్ సంక్షేమ మండలి అధ్యక్షుడిగా న్యాయవాది నాగిరెడ్డి మధుసూధన్‌రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మధుసూధన్‌రెడ్డిని రెండోసారి ఎన్నుకొన్నారు. మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్ భూమగౌడ్, గౌరవ అధ్యక్షుడు సంతోష్‌రావు, సంఘం సభ్యులు అశోక్, మనోహర్‌రావు, భాస్కర్, రమేశ్, అశోక్‌రావు పాల్గొన్నారు.

✦ నియామకం

సారంగాపూర్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీపతి రమేశ్ పటేల్‌ను నియమించారు. రమేశ్ బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారయణకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపాడు.

✦ వెల్మసంక్షేమ సంఘం ఎన్నిక

రాయికల్: మండలంలోని రామాజీపేట వెల్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా దుగ్గెల రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జకలిలేటి హరీష్‌రావు, ఉపాధ్యక్షుడిగా సంతోష్‌రావు, కోశాధికారిగా శ్రీనివాస్‌రావు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రారంభానికి సిద్ధంగా పక్కా భవనాలు

- నేడు మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా గ్రంథాలయ భవనం

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ మేరకు మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతులు మీదుగా 9న ప్రారంభించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.73లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనం, రూ.25లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న శాఖ గ్రంథాలయ భవనం, రూ.12లక్షలతో నిర్మించిన మాల సంఘం భవనం ప్రారంభానికి ముస్తాబయ్యాయి. అలాగే మండలంలోని లింగాపూర్‌లో సుమారు రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ మంత్రి ప్రారంభించనున్నారు. అలాగే మండల కేంద్రంలోని శివాలయ గాలిగోపురం, పెగడపల్లి నుంచి మల్యాల వరకు మంజూరైన రెండు వరుసల రహదారి, షాదీఖాన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు టీఆర్ఎస్ నాయకులు తెలిపారు.